క్లుప్తంగా

సీఎం నిర్ణయంపై హర్షం

నెహ్రూనగర్(గుంటూరు): రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న తొమ్మిది ఎమ్మెల్సీ స్థానాల్లో 50 శాతం బీసీలకు కేటాయిస్తానని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై తొగట వీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగట వీర క్షత్రియులు, వారి సోదరులైన దేవాంగ, పద్మశాలీ, కర్ణాబత్తుల వంటి 18 కులాల చేనేతలు మొత్తం కలిపి రాష్ట్ర జనాభాలో 19 శాతం ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం చేనేతలకు రెండు ఎమ్మెల్సీలు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కోటేశ్వరరావు, మార్కండేయులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి, శ్రీనివాసరావు, చౌడేశ్వరి పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులపై ఇంటర్ విద్యార్థులకు అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో అందిస్తున్న వివిధ కోర్సులు, వసతులపై ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగిన డిగ్రీ కోర్సుల దిశగా విద్యార్థినులు అవగాహన పెంచుకుని, ప్రవేశం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ విభాగాధిపతులు ఆయా విభాగాల వారీగా ఉద్యోగావకాశాల్ని వివరించి, సైన్స్ ప్రయోగాలను చూపించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు ప్రవీణ కుమారి (మైక్రోబయాలజీ), కె. కోటేశ్వరరావు (అర్థికశాస్త్రం), రసాయనశాస్త్ర అధ్యాపకులు శ్రీలక్ష్మి, కృష్ణారావు, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు నిఖిత, వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు కృపావాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు అఖండ సంగీతార్చన

పాత గుంటూరు: మహా శివరాత్రి సందర్భంగా లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ మందిరంలో శనివారం శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకురాలు ఎ.భారతీదేవి ఆధ్వర్యంలో 12వ అఖండ సంగీతార్చన, సంగీత, వాద్య, నృత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డి. శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6.30 గంటలకు నాద స్వరంతో కార్యక్రమం ప్రారంభమై, ఆదివారం ఉదయం 6 గంటలకు మంగళహారతితో ముగుస్తుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీ శుభాంజలి కళా వేదిక ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే విభావరి అనంతరం గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ అవార్డు పొందిన ఎంఈఓ చీకటి రవికాంత్‌ను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

గుంటూరు ఎడ్యుకేషన్: కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై భౌతికదాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది ప్రభుత్వాధికారులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఉపాధ్యాయుల్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్న పరిస్థితుల్లో వారితో స్నేహపూరితంగా ఉంటూ పని చేయించే ప్రతాప్‌రెడ్డిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. తన ప్రతి సమావేశాన్ని లైవ్‌లో రికార్డ్ చేసి యూట్యూబ్‌లో ఉంచుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు గురువారం జరిగిన సమావేశంలో ఉన్నాయని భావిస్తే తగిన సాక్ష్యాధారలతో ఎన్నికల అధికారులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలే గానీ విద్యాశాఖలో ఒక అధికారిపై భౌతిక దాడులకు పాల్పడటం సిగ్గుచేటని ఖండించారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... సాయికృష్ణ నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గజిట్ ప్రకారం కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచుతామని చెప్పి పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 నుంచి సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు నామతోటి రాణి, మందా రాజేష్, ఎం.పద్మ, సుబ్బాయమ్మ, సుమలత, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు అఖండ నాదోపాసన మహాయజ్ఞం

- విశ్వశాంతి కోసం మహోన్నత కార్యక్రమం
- ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఏకధాటిగా..
- మహా సంగీత విద్వాంసుడి సంకల్పం



కచేరి ఇస్తున్న డాక్టర్ తాడేపల్లి లోకనాథశర్మ(ఫైల్)

తెనాలి: సహాయమైనా, సహానుభూతి ప్రకటించటమైనా ఎవరి మార్గం వారిది. కొందరు తోడు నడుస్తారు.. మరికొందరు ఆర్థిక సాయంతో ఆదుకుంటారు. 79 ఏళ్ల నాదోపాసకుడు, 'తెనాలి పుర గానకళా శిరోమణి' డాక్టర్ తాడేపల్లి లోక్‌నాథ శర్మ మాత్రం అందుకు భిన్నంగా స్వరపంథా అనుసరిస్తున్నారు. మధ్యస్థమైన శరీరం, నుదుటున వెడల్పాటి విభూది పట్టీలు, తెల్లగా పెరిగిన గడ్డం, ముఖంనిండా అలుముకున్న చిరునవ్వుతో చూడగానే ఏ సంస్కృత పండితుడో అనిపిస్తారాయన. ఏకబిగిన 24 గంటలకుపైగా సర్వరాగ గంగలో సభికులను ముంచెత్తడం ఆయనకు ఇష్టం. 'ఇది ఓ సంగీత తపస్సు అంటారాయన. విశ్వశాంతిని ప్రసాదించమని, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను సంరక్షించమని కోరుతూ ఆయన నాదాన్ని ఉపాసిస్తారు. ఈ నేపథ్యంలోనే మహాశివరాత్రి రోజైన శనివారం ఉదయం 8 గంటలకు స్థానిక రామలింగేశ్వర పేటలోని శ్రీగంగాసమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో 11 గంటలపాటు అఖండ నాదోపాసన మహాయజ్ఞం నిర్వహించనున్నారు. ఆలయ ఈవో ఎ.శ్రీనివాసరెడ్డి, వంశపారంపర్య ప్రధాన అర్చక స్వామి వడ్లమూడి రాఘవ అనుమతితో ఈ సంగీత మహాయజ్ఞాన్ని తలపెట్టారు. విశ్వశాంతి, లోక కల్యాణం కోసమని ప్రకటించారు. రాత్రి ఏడు గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

వారసత్వంగా సంగీత కళ

వారసత్వంగా వచ్చిన సంగీత కళను సాధన చేసిన లోకనాథశర్మ, సంగీత పరిశోధనలో పీహెచ్‌డీ చేశారు. కేంద్రప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సంగీత వాయిద్యాల అభివృద్ధి కేంద్రమైన 'సంగీత విద్యాలయ' డెప్యూటీ డైరెక్టరుగా పని చేశారు. రీజినల్ డిజైన్, టెక్నికల్ డెవలప్‌మెంట్ సెంటర్ డెప్యూటీ డైరెక్టర్‌గా 2005లో రిటైరయ్యారు. దేశంలోని అన్ని నగరాలు, పట్టణాల్లోనూ సంగీత కచేరీలు చేశారు. ఆకాశవాణిలో ఏ గ్రేడ్ ఆర్టిస్టు అయిన లోక్‌నాథశర్మ శాస్త్రీయ సంగీతం ప్రచారంలో భాగంగా ఎన్నో ఉన్నత బాధ్యతలు నిర్వర్తించారు. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సాంగ్ అండ్ డ్రామా డివిజను, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఎంటర్‌టైన్‌మెంట్ వింగ్ స్టాఫ్ మెంబరుగా పనిచేశారు. సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో అధ్యాపకుడిగా ఎనిమిదేళ్లు చేశారు. ఉమ్మడి ఏపీ, తమిళనాడు, ఢిల్లీలోని వివిధ యూనివర్సిటీలకు సంగీతంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు పరీక్ష ప్రశ్నాపత్రాల రూపకల్పన, ప్రాక్టికల్స్ పరీక్షాధికారిగానూ వ్యవహరించారు. వివిధ రాష్ట్రాల్లోని సంగీత సభలు, సంస్థలు, అకాడమీలకు వివిధ హోదాల్లో బాధ్యులుగా పనిచేశారు. పత్రసమర్పణ, సదస్సులు, డిమాన్‌స్ట్రేషన్లలో పాల్గొన్నారు. సంగీత విద్యలో డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్‌తో సహా ఎందరో ప్రముఖులచే బహుమతులను స్వీకరించారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



తెనాలి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: స్థానిక గాంధీ చౌక్ లోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా వార్షిక కల్యాణోత్సవ కార్యక్రమాలను త్రయాహ్నిక దీక్షతో శుక్రవారం ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో అర్చకులు జంపని భాస్కర శర్మ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామిని పెండ్లి కుమారునిగా చేసి ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం గణపతి పూజ అనంతరం నంది ధ్వజ ఆరోహణ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ శనివారం స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపి సాయంత్రం కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఆదివారం ప్రత్యేక అర్చనలు లోకహితార్థం మహా శాంతి హోమం, పూర్ణాహుతి, సాయంత్రం పట్టణంలో రథోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. రాత్రి 8 గంటలకు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు.

పౌరాణిక కళాకారుడు ఏడుకొండలుకు సన్మానం



ఏడుకొండలును సన్మానిస్తున్న రామ్మోహనరావు, రాంబాబు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం శ్రీ తిరుపతమ్మ కథ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు చక్కా ఏడుకొండలును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోవూరి రామమోహనరావు, జాలాది రాంబాబు, కె.సాంబశివుడు, ఎ.గౌతమ్ నరేంద్రనాథ్, కాకుమాను రామారావు, రావూరి హరీష్‌బాబు, పెమ్మసాని పోతురాజు, ఈదర వెంకటపూర్ణచంద్, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని,ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

అనుమానాస్పద మృతి మిస్టరీని ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, చిత్రంలో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సర్కిల్‌లో నిందితులు

తెనాలి రూరల్: ఆత్మహత్యగా భావించిన అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మాయ మాటలు చెప్పి ఓ వ్యక్తిని నమ్మకంగా తమ వెంట తీసుకెళ్లి నగదు కోసం హత్య చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. ఆమె కథనం ప్రకారం.. ఈనెల 6న తెనాలి మండలం కఠెవరం గ్రామ చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం రావడంతో రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతుడిని గుంటూరు కొరిటెపాడుకు చెందిన పెద్దింటి వెంకటశ్రీకాంత్(36)గా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గుంటూరులో ఒక్కడే నివసిస్తున్నాడు. 5వ తేదీన తెనాలి వచ్చిన అతను 6వ తేదీ ఉదయం కఠెవరం చెరువులో మృతి చెంది పడి ఉన్నాడు. తన కుమారుడు మద్యం మత్తులో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి తల్లి అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు పూర్తి వివరాలు రాబట్టగలిగారు. తెనాలిలోని బంధువుల ఇంటికని వచ్చిన శ్రీకాంత్ ఇక్కడి నాజరుపేట నుంచి నడుచుకుంటూ కబేళా వంతెన వద్దకు వెళ్లాడు. అక్కడ ఆటో మాట్లాడుకుని మార్కెట్ ఏరియాలోని బార్‌కు వెళ్లినట్టు పోలీసుల విచారణలో తెలిసింది. బార్ వద్ద ఇద్దరు వ్యక్తులు పరిచయమై, అతనికి మాయమాటలు చెప్పి తమ ఆటోలో ఎక్కించుకుని కఠెవరం తీసుకెళ్లినట్టు గుర్తించారు. వీరిద్దరి ఆచూకీ కోసం యత్నించగా, వైకుంఠపురం పోతురాజు కాలనీకి చెందిన అన్నం రమేష్, చినరావూరు రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన కె.మాధవ్‌లుగా తేలింది. శ్రీకాంత్‌ను తమ వెంట తీసుకెళ్లి అతని జేబులో ఉన్న రూ.600 లాక్కోవడంతోపాటు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేసి శ్రీకాంత్‌పై దాడి చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని చెరువులో పడేసి ఆటోలో వెళ్లిపోయారు. ఆటోను పోలీసులు గుర్తించకుండా ఉండాలని దానిపైన ఉండే కవరును మార్చి తప్పించుకుని తిరుగుతున్నారు. నిందితుల కదలికలపై నిఘా పెట్టి పోలీసులు చివరకు అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలం వద్ద ఎటువంటి ఆధారం లేకపోయినా కేసును అతి త్వరగా దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్న రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుళ్లు వి.రవి, పి.మణికుమార్, డి.శివరామకృష్ణ, రాములను డీఎస్పీ అభినందించారు.

మేకల దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, చిత్రంలో సీఐ శ్రీనివాసరెడ్డి, కొల్లిపర ఎస్‌ఐ రవీంద్రరెడ్డి, సర్కిల్‌లో నిందితులు

తెనాలి రూరల్: గొర్రెల కాపరిపై దాడి చేసి తాళ్లతో కట్టేసి మేకలను అపహరించుకెళ్లిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. బాపట్ల జిల్లా కొల్లేరుకు చెందిన బాణావత్ హజ్యానాయక్ కంజు పిట్టల వ్యాపారం చేసి నష్టాలపాలయ్యాడు. ఈ నష్టాలను పూడ్చేందుకు తన తోడల్లుడు బాణావత్ రామకోటయ్యనాయక్‌ను వ్యాపార భాగస్వామిగా చేసుకుని గొర్రెల వ్యాపారం మొదలు పెట్టాడు. ఇద్దరు కలిసి రవాణా వాహనాన్ని ఫైనాన్సు పద్ధతిలో తీసుకున్నారు. ఈ వ్యాపారంలోనూ నష్టం రావడంతో గొర్రెలను అపహరించి అమ్ముకుని సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమ వద్ద పని చేసే మాణికల బ్రహ్మయ్య, తలపాల లోకేష్‌కు వీరి పథకం తెలిపారు. కృష్ణా పరీవాహక ప్రాంతమైన గుంటూరు జిల్లా కొల్లిపర మండలం మున్నంగి, కృష్ణా జిల్లా తోట్లవల్లూరు ప్రాంతంలో రైతులు గొర్రెలను మేపడానికి తీసుకెళ్తుంటారని తెలుసుకుని, వాటిని అపహరించాలని నిర్ణయించుకుని రెక్కీ నిర్వహించారు. హజ్యానాయక్, రామకోటయ్యనాయక్ బైక్‌పై ఆ ప్రాంతాలకు వెళ్లారు. వీరి వెనుక గొర్రెల రవాణా వాహనంలో బ్రహ్మయ్య, లోకేష్ వెళ్లారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో మేకలను మేపుతున్న కొల్లిపర మండలం మున్నంగికి చెందిన మన్నంగి కిట్టారావును కత్తితో బెదిరించి, తాళ్లతో అతని కాళ్లుచేతులు కట్టేసి దాడి చేసి, 40 మేకలను తోలుకుని వెళ్లిపోయారు. అపహరించుకెళ్లిన మేకలను అనంతపురం తీసుకెళ్లి రూ.4.60 లక్షలకు విక్రయించారు. బాధితుడు కిట్టారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొల్లిపర ఎస్‌ఐ రవీంద్ర రెడ్డి తన సిబ్బంది ఎ. పోతురాజు, డి. శ్యాంకుమార్, జి. వెంకటేశ్వరరావు, బి. తాతారావు, ఆర్. రాజేష్, ఎం.కూర్మారావుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుల కదలికలపై సమాచారం సేకరించారు. మేకలను విక్రయించి వస్తున్నారన్న సమాచారంతో హనుమాన్‌పాలెం చెక్‌పోస్టు వద్ద వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.నాలుగు లక్షల నగదు, రవాణా వాహనం, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చాకచక్యంగా గుర్తించి అదుపులోకి తీసకున్న ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో రూరల్ సీఐ కడప శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ బయోపిక్ బాబూజీ తొలి షెడ్యూలు పూర్తి



మాట్లాడుతున్న దిలీప్‌రాజా. పక్కన మిలటరీ ప్రసాద్

తెనాలి: పెదరావూరు ఫిలిం స్టూడియోస్ పతాకంపై దిలీప్‌రాజా దర్శకత్వంలో జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర ఆధారంగా తీస్తున్న సినిమా 'బాబూజీ' తొలి షెడ్యూల్ పూర్తయింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఇక్కడి సుల్తానాబాద్‌లోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో దిలీప్‌రాజా నిర్వహించిన విలేకరుల సమావేశంలో తొలి షెడ్యూలులోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. జగ్జీవన్‌రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్, ఆయన కుమార్తె మీరాకుమార్ పాత్రలో సీనియర్ నటి తాళ్లూరి రామేశ్వరితో తీసిన సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. చిత్రదర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ కొన్ని సన్నివేశాలు మినహా సినిమా దాదాపు అంతా ఆంధ్రప్రదేశ్‌లోనే తీస్తామని చెప్పారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, నెహ్రూ, బాబూ రాజేంద్ర ప్రసాద్, ఇందిర పాత్రలు ఇందులో ఉన్నాయని చెప్పారు. బిహార్లోని చాంద్వా గ్రామం జగ్జీవన్‌రామ్ స్వస్థలమని చెబుతూ తెనాలి-చినపరిమి రోడ్డులో చాంద్వా గ్రామం సెట్‌ను వేయాలని తలపెట్టామని చెప్పారు. 40 ఏళ్ల పార్లమెంటేరియన్‌గా కొనసాగిన జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని జైలుజీవితం అనుభవించారని దిలీప్‌రాజా చెప్పారు. ఆయనను స్వరాజ్య ఉద్యమంలోకి సుభాష్ చంద్రబోస్ ఆహ్వానించినట్టు వివరించారు. బోస్ పాత్రలో సీనియర్ నటుడు ప్రకాష్‌రాజ్, జగ్జీవన్‌రామ్ భార్య పాత్రలో సుహాసిని నటిస్తారని వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేస్తే అందులోని అంశాల అమలుకు పార్లమెంటేరియన్‌గా జగ్జీవన్‌రామ్ కృషిచేసినట్టు చెప్పారు. ఎలాంటి వివాదాలకూ తావులేకుండా జగ్జీవన్‌రామ్ బయోపిక్‌కు చిత్రరూపం ఇస్తామని, 2024 జనవరి 9న విడుదల చేస్తామని వివరించారు. దిలీప్‌రాజాతోపాటు జగ్జీవన్‌రామ్ పాత్రధారి మిలటరీ ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.

13వ వార్డులో మురుగుకాల్వల నిర్మాణ పనులు ప్రారంభం



కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కుర్రా శ్రీను తదితరులు

తెనాలిఅర్బన్: 13వ వార్డు చినరావూరు రైల్వేస్టేషన్ సమీపంలోని పంతగాని వారి వీధిలో 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.9.50 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న డ్రెయిన్ నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత, నాయకులు కుర్రా శ్రీను శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ డ్రెయిన్‌లు దెబ్బతినడం వల్ల ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్మపర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్‌ల సహకారంతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రావూరి సుబ్బారావు, ఏఈ చైతన్య, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి



ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ కమిషనర్ ఇన్నా కె.భాస్కర్

శిరిపురం(కొల్లిపర): ప్రభుత్వం మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని విద్యాశాఖ కమిషనర్ ఇన్నా కె.భాస్కర్ చెప్పారు. శుక్రవారం మండలంలోని శిరిపురం గ్రామంలోని ఎంపీపీఎస్(ఎల్‌ఈ) పాఠశాలలో డెమోగా నిర్వహిస్తున్న ఆర్‌సీసీ ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి కావటంతో డీఈఓ పి.శైలజతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మనబడి నాడు-నేడు ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొల్లిపర మండలంలో ఆర్‌సీసీ ప్రీ కాస్ట్ కాంపౌండ్ వాల్ నిర్మాణం డెమో బాగుందన్నారు. ఆయన వెంట సమగ్రశిక్షణ అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి , జిల్లా ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ జె.రవి , ఎస్‌ఈ నాగరాజు, ఈఈ జి.సుధాకర్, ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్లు , మండల ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.రమేష్ , ఏఈ సి.హెచ్.నాగేంద్రం, పాఠశాల హెచ్‌ఎం పి.సధాలక్ష్మీదేవి, ఉపాధ్యాయురాలు సరళ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సిహెచ్ శ్రీకుమార్ , సీఆర్‌పీఎస్ పి.రమేష్‌బాబు, డి.స్వప్నరాణి తదితరులు ఉన్నారు.

అంతర్గత రోడ్లు నిర్మించాలని వినతి



కమిషనర్ జశ్వంతరావుతో మాట్లాడుతున్న కౌన్సిలర్ జయపాల్, నారాయణ తదితరులు

తెనాలిఅర్బన్: అమరావతి ఫ్లాట్స్‌లో అంతర్గత రోడ్లను నిర్మించాలని 30వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కొమ్మరబత్తిని జయపాల్, అమరావతి ఫ్లాట్స్ అసోసియేషన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావును శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి కోరారు. అమరావతి ఫ్లాట్స్‌లో ఏర్పాటు చేయాల్సిన మురుగు కాల్వలు, పిచ్చి మొక్కల సమస్యలను తెలియజేశారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న గోవిందరాజులు, లావణ్య, తదితరులు

తెనాలిఅర్బన్: కొల్లిపర మండలం అన్నవరం గౌడపాలెంకు చెందిన యేమినేని దక్షిత్ పుట్టినరోజు సందర్భంగా యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో చెంచుపేటలో పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని గాంధీ వృద్ధాశ్రమం, యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమాల్లోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యేమినేని గోవిందరాజులు, లావణ్య, ట్రస్ట్ నిర్వాహకులు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన 32 ఏళ్ల గృహిణి అంగోతు జయంతిబాయి గురువారం రాత్రి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. భర్త రామకృష్ణతో మనస్పర్థల కారణంగా వెళ్లిందని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్‌ఐ ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

ప్రణాళికతోనే ఒత్తిడి, భయం నివారణ



గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్షల వేళ సరైన ప్రణాళిక ద్వారా విద్యార్థుల్లో కలిగే భయాలు, ఒత్తిడిని అధిగమించవచ్చని సైకాలజిస్ట్ కృష్ణభరత్ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో శుక్రవారం భాష్యం మెడెక్స్ కళాశాల, భాష్యం ఐఐటీ విద్యార్థులకు పరీక్షల భయాన్ని, ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణభరత్ మాట్లాడుతూ జ్ఞానేంద్రియాల ద్వారా సమాచారం మానవ మెదడుకు అందుతుందని, అందులో ముఖ్యంగా నేత్రాల ద్వారా మనం చూసిన చిత్రం దాని తాలూకు సమాచారమంతా నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు. అందువల్ల మనం ఊహాశక్తిని ఉపయోగించుకుని మెదడుకు సరైన సంకేతాల్ని అందించడం ద్వారా భయాన్ని, ఒత్తిడిని అధిగమించి రానున్న పరీక్షలకు సునాయాసంగా సమాయత్తం కావచ్చని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయాందోళనల్ని తొలగించి వారిలో మానసికస్థైర్యాన్ని నింపడానికి భాష్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులంతా ఉన్నత విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర దిగుబడులు



గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయంతోపాటు ఆరోగ్యకరమైన పంటల్ని రైతులు పండించవచ్చని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. వెంకటనాయుడు తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విస్తరణ సంచాలకుడు మాట్లాడుతూ నిరంతరమైన సుస్థిరమైన వ్యవసాయాన్ని ఒక ప్రత్యామ్నాయంగా రైతులు మలుచుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో మట్టి, సహజ వనరుల వినియోగం, పంటల సాగు విధానం, నీటి, వాయుకాలుష్యం, తదితర విషయాలను వివరించారు. కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూమి, వాయు, వాతావరణ కాలుష్యంతో పాటు ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన సామగ్రి, జీవన ఎరువుల్ని రైతులకు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. గంగాదేవి, డాక్టర్ అనిల్, డాక్టర్ దీప, డాక్టర్ అర్చనతో పాటు 112 మంది రైతులు, మూడు జిల్లాల రైతు సాధికార సంస్థ, ఏపీసీఎంఎన్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.